క్లుప్తంగా

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

పూడూరు: ఈ నెల 16 వరకు పట్టదారు పాస్ బుక్కులు పొందిన రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాంబాబు తెలిపారు. పట్టదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతచేసి మండల వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు



నాగవరంలో పగలే వెలుగుతున్న వీధిలైటు

బంట్వారం: పల్లెల్లో కొన్ని చోట్ల పగలే విద్యుత్ దీపాలు వెలుగుతుండడంతో గ్రామ పంచాయతీలకు విద్యుత్ బిల్లులు భారంగా మారాయి. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో 29 గ్రామ పంచాయతీలు, ఆరు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పగలే వీధి లైట్లు వెలుగుతూ కనిపిస్తుంటాయి. మేజర్, మైనర్ పంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా విద్యుత్ వినియోగం ఉంటుంది. వీధి లైట్లు, నీటి సరఫరా, జీపీ భవనం ఇతరత్రా అవసరాలను మీటర్లు బిగిస్తారు. డిస్కంలు కూడా కరెంటు చార్జీలను పెంచేశాయి. ఈ లెక్కన విద్యుత్ దుబారాను అడ్డుకోకుంటే బిల్లులు తడిసి మోపవడం ఖాయం. ప్రభుత్వాలు విడుదల చేసే ఎస్ఎఫ్‌సీ, సీఎఫ్‌సీ నిధుల నుంచి పంచాయతీ కార్యదర్శులు అడ్జస్ట్‌మెంట్ చేస్తున్నారు. పాత బకాయిలు కూడా సర్దుబాటు చేస్తుంటారు. ఇప్పటికైనా విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే జీపీలకు కాస్త ఆర్థిక భారం తగ్గుతుంది.

పేదల సంక్షేమమే ధ్యేయం



పూడూరులో కరపత్రాలు పంచుతున్న బీజేపీ నేతలు

పూడూరు: పేదల సంక్షేమమే ప్రధాని నరేంద్ర మోదీ ధ్యేయమని బీజేపీ మండల పాలక్ దేవరాజ్ అన్నారు. మండల కేంద్రంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్, మండల అధ్యక్షుడు అనిల్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు శేఖర్, జిల్లా నాయకులు వెంకటయ్య, రాజు, గిరిజన మోర్చా అధ్యక్షుడు దశరథ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.


ఘనంగా తొలి ఏకదాశి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చేవెళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. గురువారం తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. ఏడాదిలో వచ్చే 24 ఏకదశుల్లో ఆషాఢ శుక్ల ఏకాదశి తొలి ఏకాదశిగా భావిస్తుంటారు. పూర్వం ఈ తొలి ఏకదశి నుంచే కొత్త సంవత్సరంగా పరిగణించేవారని, అందుకే తొలి ఏకదాశి అంటే ప్రత్యేకత ఉండేదని చెబుతుంటారు. ఈరోజు విష్ణు పరమాత్మునికి అత్యంత ప్రీతికరమైన రోజని పూజారులు తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాత శ్రీశైలం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి గురువారం నడికూడ శ్రీశైలం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా రూ. 31వేల నగదును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న పురాతన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌గుప్తా, వెంకటయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీకైన బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. పర్వదినం సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కులమతాలకు అతీతంగా ఆలింగనం చేసుకొని, శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే ఈ ఉత్సవం.. భక్తిభావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమని చెప్పారు. యేటా ఇస్లాం క్యాలెండర్‌లోని బక్రీద్ మాసంలో 11వ రోజున ఈ పడుగను జరుపుకోవడం ఆనవాయితీ అని గుర్తుచేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరు టౌన్: ఈద్గా వద్ద ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, శుభప్రద్ పటేల్



పరిగి: బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



అనంతగిరి: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆనంద్



యాలాలలో.. చిన్నారులు



కుల్కచర్ల: ముజాహిద్‌పూర్‌లో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి



యాలాల: ముద్దాయిపేట ఈద్గాలో..



ధారూరు: ఈద్గా వద్ద చిన్నారులు



కొడంగల్‌లో..



బంట్వారం: కోట్‌పల్లిలో..

నిరుపేదలకు అండగా నిలుస్తాం

కుల్కచర్ల: బడుగుబలహీన వర్గాల ఉన్నతికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం చౌడాపూర్ మండల కేంద్రంలో పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి రాము సోదరుడు నర్సింహులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీఆర్ఆర్ ఆయన అంత్యక్రియల్లో పాల్గొని మాట్లాడారు. నిరుపేదలు, పార్టీ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు వచ్చినా తాము అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ చౌడాపూర్ మండలం అధ్యక్షుడు అశోక్‌కుమార్, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

సీఐ వెంకటేశ్వర్లుకు అభినందనలు



సీఐని అభినందిస్తున్న ఏసీపీ కుశాల్కర్

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు సీఐగా పదోన్నతి పొందారు. దీంతో గురువారం ఏసీపీ కుశాల్కర్ వెంకటేశ్వర్లుకు స్టార్ పెట్టి అభినందించారు. ఇటీవల 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలకు ప్రభుత్వం సీఐలుగా పదోన్నతి కల్పించింది. అదే బ్యాచ్‌నకు చెందిన వెంకటేశ్వర్లు షాద్‌నగర్‌తో పాటు నందిగామ, చౌదరిగూడ పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. అనంతరం సీఐ వెంకటేశ్వర్లు ఏసీపీ కుశాల్కర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జింకుకు ఇదే అదును

- లోపం నివారణకు చర్యలు
- అవగాహన కల్పించిన ఏఓ అనురాధ



బొంరాస్‌పేట: పంటలకు పోషకాలను అందించి, అధిక దిగుబడి రాబట్టేందుకు కీలక భూమిక పోషించే జింకు వినియోగంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. జింక్ లోపంతో పంట 20 శాతం వరకు దిగుబడి తగ్గుతుంది. అందుకు కారణం జింక్ వాడక పోవటమే అని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీనిపై మరింత అవగాహన కల్పించేందుకు బొంరాస్‌పేట మండలం ఏఓ అనురాధ అందిస్తున్న జింక్‌లోపం, నివారణ చర్యలు, ఉపయోగాలు కింది విధంగా ఉన్నాయి.

ఉపయోగాలు

మొక్కకు ఉపయోగపడే కిరణజన్య సంయోగ క్రియ, శ్వాస క్రియలతో పాటు అన్ని క్రియల్లో జింక్ ఉపమయోగ పడుతుంది. మొక్క బతకడానికి అన్ని జీవన క్రియల ఉత్పత్తిలో జింక్ ఉపయోగ పడుతుంది. జింక్ లోపం లేకుండా చర్యలు తీసుకుంటే పంట 20 శాతం దిగుబడిని పెంచుకోవచ్చు.

పంటలు, లోపం లక్షణాలు

జింక్ లోపం ఉన్న పొలాల్లో మొదట ఏ పంట అయినా పసుపు రంగులోకి మారి తర్వాత ఎరుపుగా మారుతుంది. ప్రధానంగా వరిలో ఆకు పెలుసు (పెడుసుగా) మారుతుంది. జింక్‌లోపం తీవ్రమైతే ఆకుపై ఇటుక ఎరుపు రంగులో మచ్చలు కనిపిస్తాయి. మిగితా పంటల్లో పసుపు రంగులో కనిపిస్తుంది. మొక్క జొన్నలో సుడి ఆకు తెల్లగా మారుతుంది.



రైతులకు పంపిణీ చేసే జింక్ ప్యాకెట్లు

లోపానికి కారణాలు

జింక్ లభ్యత తక్కువగా ఉంటే చౌడు నేలల్లో పీహెచ్(ఉదజని సూచిక) ఎక్కువగా ఉంటుంది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను మోతాదు మించి వాడితే భాస్వరం నిల్వలు పెరిగి జింక్‌లోపం ఏర్పడుతుంది.

నివారణకు చర్యలు

400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో రాత్రి నానబెట్టి ఉదయం వడగట్టాలి. ఆ తర్వాత ఈ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పొలంలో పిచికారి చేసుకొని జింక్‌లోపాన్ని నివారించుకోవచ్చు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో అవస్థలు
- కొరవడిన కనీస సౌకర్యాలు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, చిన్నారులు
- సొంత భవనాలు మంజూరైనా.. మరూ కాని నిర్మాణాలు

దౌల్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కరువయ్యాయి. అరకొర సౌకర్యాలతో ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. దీంతో సిబ్బంది, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఆటపాటలు లేక డీలా పడిపోతున్నారు. కొన్నింటిని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నా.. అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని టీచర్లతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ కాలమెల్లదీస్తున్నారు. మండలంలో 66 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 2 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఒక్కటి మాత్రమే సొంత భవనంలో కొనసాగుతుండగా.. 18 అద్దె భవనాలు, 49 ప్రభుత్వ కమ్యూనిటీ హాల్స్, సర్కారు బడుల్లో నిర్వహించబడుతున్నాయి. కొన్ని సొంత భవనాలకు నిధులు మంజూరైనా.. నిర్మాణాలు చేపట్టడం లేదు.

చదువు, వంటకు ఒకే గది

దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఉన్న ఐదు కేంద్రాలు అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. కనీసం ఆ గదుల్లో వెలుతురు కూడా సరిగా రాదని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.750 కిరాయికి ఎవరూ కూడా.. సౌకర్యాలు గల భవనాలు ఇవ్వడం లేదని టీచర్లు చెబుతున్నారు. దేవర్‌ఫస్‌వాద్‌లో ప్రభుత్వ పాఠశాలలోని ఓ గదిలో మూడు కేంద్రాలను కొనసాగిస్తున్నారు. అదే గదిలో వంట వండుతున్నారు. గుముడాలలో శిథిలావస్థ భవనం కాగా.. ఊరగుంటతండాలో దానికి రెట్టింపు పరిస్థితి. ఒకే గదిలో చదువు, వంట కావడంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్రాల్లో ప్రతి రోజు చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధనలు, గర్భిణులు బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తారు. భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడేం జరుగుతోందని అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో మరింత దారుణంగా ఉంటుందని, సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనాలను మంజూరు చేయాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



నీటూరులో ఓ పాఠశాలలో కొనసాగుతున్న కేంద్రం

ఉన్నతాధికారులకు వివరించాం



నేను మండలానికి కొత్తగా వచ్చాను. మండలంలో 18 కేంద్రాలు అద్దె భవనాల్లో, 49 వివిధ ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. చాలా కేంద్రాల్లో ఇబ్బంది ఉన్న విషయం వాస్తవం. ఈ విషయం ఉన్నతాధికారులకు వివరించాము. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఏ ఇబ్బంది లేకుండా చూడాలని టీచర్లకు చెప్పాం.

– ధనలక్ష్మి, సూపర్‌వైజర్

ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

- ధూపదీప నైవేద్యం కింద మరిన్ని గుడులు
- డీడీఎన్‌తో అర్చకుల నియామకం
- పలువురికి ప్రొసిడింగ్ కాపీల అందజేత

జిల్లాలో మరికొన్ని దేవాలయాలకు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఇన్నాళ్లు ఆదాయం లేక ఇక్కట్లు పడుతున్న ఆలయాల అర్చకులకు దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం నుంచి ఆర్థిక అండ లభించింది. అంతే కాకుండా కొత్తగా డీడీఎన్ పరిధిలోకి వచ్చిన ప్రార్థనాలయాలకు నియమితులైన అర్చకులకు ఇటీవల ఎమ్మెల్యేలు నియామక పత్రాలు అందజేశారు.



ఇటీవల అర్చకులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ఉమ్మడి రాష్ట్రంలో ఆలయాలకు నిత్యం ధూపదీప నైవేద్యాలు జరగాలన్న ఉద్దేశంతో పాటు, అర్చకులకు ఉపాధి కల్పించేందుకు దివంగత నేత, నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో ధూపదీప నైవేద్య పథకానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా నెలకు గౌరవ వేతనం రూ.2వేలు చెల్లించేవారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.2వేల నుంచి 6వేలకు పెంచారు. ప్రస్తుతం రూ.10వేలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించినప్పటికీ ఇంకా అమలు కాలేదు.

నిత్యపూజలు

దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ధూపదీప నైవేద్యం పథకం కొనసాగుతోంది. ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులు నిత్య పూజలు, నైవేద్యంతో పాటు పండుగలు, ఉత్సవాల సమయాల్లో ప్రత్యేక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రస్తుతం ధూపదీప నైవేద్యం కింద అర్చకులకు నెలకు రూ.6వేలు చెల్లిస్తుండగా.. అందులోంచి నూనే, ప్రసాదం, ఇతర ఖర్చులకు రూ.2వేలు వెచ్చించాల్సి ఉంటుంది. సీఎం ఇటీవలే రూ.10వేలు పెంచుతున్నట్లు ప్రకటించారు.

65మంది అర్చకులు

పథకం ప్రారంభం నాటి నుంచి విడతలుగా ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు అర్చకులను ప్రభుత్వం నియమిస్తోంది. తాజాగా నియోజకవర్గంలోని పరిగి, పూడూర్, దోమ, కుల్కచర్ల, గండీడ్ మండల పరిధిలోని ఆలయాలకు 45 మంది అర్చకులను నియమించగా.. ఈనెల 24న వారికి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఉత్తర్వులను అందజేశారు.

రుణపడి ఉంటాం..



ధూపదీప నైవేద్యం పథకంలో ఆలయ అర్చకులకు మరింత గౌరవ వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. అదే విధంగా మరింత మందికి అవకాశం కల్పించడం హర్షణీయం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. కానీ ఇంకా చాలా మంది అర్చకులు నిరాశగా ఉన్నారు. వారి గురించి ప్రభుత్వం ఆలోచించాలి.

– జోషి కిరణ్ కుమార్, పరిగి

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

- మోదీ పాలనను కోరుకుంటున్న ప్రజలు
- ఇంటింటికీ బీజేపీలో ఆ పార్టీ నేతలు

దౌల్తాబాద్: బీజేపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ తమిళనాడు ప్రాంత నియోజకవర్గ ఇన్‌చార్జి అరుణదేవి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం మండల కేంద్రంలో పర్యటించారు. తొమ్మిదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. నాయకులు కూర వెంకటయ్య, నర్సింహులు, సతీష్ ముదిరాజ్, బుగ్గప్ప, జములప్ప, అశోక్, బసంత్ పాల్గొన్నారు.

అప్పుల రాష్ట్రంగా..

దోమ: తొమ్మిదేళ్లుగా సంక్షేమ పథకాలు, ప్రాజెక్టుల పేరుతో సీఎం కేసీఆర్ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి ఆరోపించారు. 'మహా సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా దోమ మండలం దోర్నాల్‌పల్లి, మైలారంలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, నర్సింహులు, నితిన్‌సాగర్, హరిశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ మణికంఠ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని..

పరిగి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు అన్ని విధాల నష్టపోయారని, తెలంగాణ ప్రజలు మోదీ పాలనను కోరుకుంటున్నారని బీజేపీ జిల్లా నాయకుడు ఆంజనేయులు అన్నారు. 'మహా సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఇంటింటికీ తిరిగి.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. బీజేపీ నాయకులు రమేష్, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, నర్సింహులు, అనిల్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఉద్యమ స్వరానికి అశ్రునివాళి

'తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజా గాయకుడు సాయిచంద్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు' అని కవులు, కళాకారులు, ప్రజా సంఘాలు, బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ గుండెపోటుతో మరణించగా.. జిల్లాలో ఆయన చిత్రపటానికి గురువారం పలువురు నివాళి అర్పించి మాట్లాడారు. అతి చిన్న వయసులో సాయిచంద్‌ను కోల్పోవటం చాలా బాధాకరమన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కొడంగల్: హైదరాబాద్‌లో సాయిచంద్ పార్థివ దేహం వద్ద ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి నివాళి



అనంతగిరి: ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో..



పరిగిలో..



యాలాలలో..



కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో నేతల నివాళి



పూడూరులో..